తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

### కాళంగి పొర్లుకట్టను

# తవ్వేస్తున్నారు


కాళంగి పొర్లుకట్టను తవ్వుతున్న దృశ్యం

సూళ్లూరుపేట, జులై 24 ప్రభాతవార్త

సూళ్లూరుపేట పట్టణ నడిబొడ్డులోని కాళంగి నదిని జాతీయ రహదారికి సమీపంలో పడమటి వైపున ఉన్న పొర్లుకట్టను చెత్త తొలగింపు పేరుతో తవ్వేస్తున్నారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో సేకరించిన చెత్తను గత కొన్నేళ్లుగా జాతీయ రహదారి పక్కనే ఉన్న కాళంగి నది పరీవాహక ప్రాంతంలోని ఖాళీ స్థలంలో వేస్తున్నారు. ఈ చెత్త వలన కాళంగి నది కాలుష్యం బారిన పడిపోయింది. అలాగే ఈ చెత్తలో అప్పుడప్పుడు అకస్మాత్తుగా మంటలు చెలరేగి దట్టమైన పొగతో జాతీయ రహదారిని కమ్మేస్తూ ప్రమాదాలకు నెలవుగా మారింది. మంటలు రేగినప్పుడు వచ్చే చెత్తలోని బూడిద పట్టణంలోని డంపింగ్ యార్డుకు సమీపంలో నివాస గృహాలపై పడటం జరుగుతుండేది. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీ వారి విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం జిగ్మా ప్రాజెక్టు ద్వారా చెత్తను తొలగించే ప్రక్రియ చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలలో ఈ చెత్త తొలగింపు కార్యక్రమాన్ని ప్రత్యేక యంత్రాల ద్వారా తొలగించి వ్యర్థాలను తుక్కుగా మార్చి వాటిని ఇక్కడి నుంచి లారీలలో తరలించే ఏర్పాటు చేస్తున్నారు. ఇదిలావుంటే ఈ చెత్త తొలగింపు ప్రక్రియలో భాగంగా 20 అడుగులు వెడల్పు ఉన్న కాళంగి పొర్లుకట్టను తవ్వేస్తున్నారు. కాళంగి పొర్లు కట్టపై చెత్త పేరుకుని ఉండటంతో, చెత్త తొలగించే క్రమంలో ఈ కట్ట కూడా తొలగింపునకు గురవుతోంది. ఈ విషయమై చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాళంగి నదికి భారీగా వరదలు వస్తే వరద నీరు ఈ పక్క ప్రాంతాలను ముంచేయడం తప్పనిసరి. ఈ విషయమై ఈ ప్రాంత వాసులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో ప్రస్తుతానికి కట్టను తవ్వే ప్రక్రియను నిలిపేశారు. కాగా, ఈ తొలగింపు కార్యక్రమాన్ని పర్యవేక్షించాల్సిన ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## తిరుపతిలో త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

### -బిజెపి నాయకులు ఘన స్వాగతం



తిరుపతికార్పొరేషన్, జూలై 24ప్రభాతవార్త తిరుపతికి త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి గురువారం చేరుకున్నారు. తిరుపతి పద్మావతి విశ్రాంతి భవనం వద్ద తిరుపతి బిజెపి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, టిటిడి బోర్డు సభ్యుడు,రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాశ్‌రెడ్డితోకలసి ఘన స్వాగతం పలికారు ఈ సందర్భంగా దుశ్శాలుతో సన్మానించారు.గవర్నర్‌తో వివిధ అభివృద్ధి అంశాలపై సామంచి శ్రీనివాస్ చర్చించారు.

### జనవరి 8న తొక్కిసలాట ఘటనలో

# ఆ ఇద్దరిపై క్రిమినల్ చర్యలు

### రాష్ట్రమంత్రివర్గం ఆదేశం -వణుకుపుట్టిస్తున్న తుది నివేదికలు


(ఫైల్)

తిరుపతి,జూలై 24ప్రభాతవార్త:

సరిగ్గా ఏడునెలల క్రిందట తిరుపతిలో జరిగిన భక్తుల తొక్కిసలాట ఘటనకేసులో అసలైన బాధ్యులైన ఇద్దరు అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకునే దిశగా ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు గురువారం అమరావతిలో జరిగిన రాష్ట్రమంత్రి వర్గ సమావేశంలో న్యాయకమిషన్ నివేదించిన 200 పేజీల నివేదికపై మంత్రులతో చర్చించిన సిఎం చంద్రబాబునాయుడు తీవ్రంగానే స్పందించారు. తొక్కిసలాట ఘటనపై విచారణకు నియామకమైన జస్టిస్ సత్యనారాయణమూర్తి కమిటీ తుది నివేదికలు సమర్పించింది, ఇప్పుడు ఆ నివేదికలు ప్రభుత్వానికి అందడంతో జనవరి 8న ఘటనకు కారణమైన ఇద్దరు అధికారులు ఎస్వీ గోశాల మాజీ డైరెక్టర్ డాక్టర్ హరనాథరెడ్డి, మాజీ తిరుపతి క్రైమ్ డిఎస్పీ వి.రమణకుమార్‌పై క్రిమినల్ చర్యలు తీసుకునే దిశగా ఆదేశాలు వెలువడ్డాయి. ఆఇద్దరు అధికారుల్ని నిందితుల్ని చేస్తే ఆరోజు భద్రత పరంగా ఉన్న రెవెన్యూ, పోలీసు, టిటిడి విజిలెన్స్,హోంగార్డులపై చివరగా ఇంకెందరిపై వేటుపడతుందనేది మళ్లీ భయంగొల్పిస్తోంది. శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠద్వార దర్శనాలు కల్పించే సమయంలో ఈ ఏడాది జనవరి8వతేదీ రాత్రి తిరుపతిలో జరిగిన తొక్కి సలాట ఘటన చోటుచేసుకున్న విషయం విదిమతే. ఈ ఘటనలో ఎనిమిది మంది యాత్రికులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఘోరతప్పిదాలకు ఇంకెందరు కారణమనేది ఇప్పుడు వణికిస్తోంది. ఈ విషాద ఘటన కేసులో బైరాగిపట్టెడ రామానాయుడు పాఠశాల కౌంటర్ల ప్రాంతంలో ఆ రోజు బందోబస్తు విధుల్లో ఉన్న తిరుపతి నగరక్రైమ్ డిఎస్పీ రమణకుమార్, టిటిడి ఎస్వీగోశాల డైరెక్టర్ హరనాథరెడ్డిని అదేరోజు సస్పెండ్ చేసిన విషయం విదితమే. ఐఎఎస్, ఐపిఎస్‌లను తక్షణం బదిలీ వేటుపడింది. అంతేగాక ఇలాంటి సందర్భాల్లో అనుసరించాల్సిన వ్యూహం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై కూడా న్యాయకమిషన్ సూచనలు చేసినట్లు తెలుస్తోంది.

# వైభవంగా కార్తీకేయుని గ్రామోత్సవం



నాలుగుమాడావీధుల్లో ఊరేగుతున్న సుబ్రమణ్యం స్వామి

శ్రీకాళహస్తి,జూలై 24 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన చెంగల్వరాయస్వామి, అనుబంధ ఆలయం అయిన కుమారస్వామి కొండపై వారం రోజుల పాటు నిర్వహించిన కార్తీకేయుని మహోత్సవాల ప్రధాన ఉత్సవాలు గురువారంతో ముగిసాయి. ఉదయం నుంచి ఆలయంలో స్థానిక ఆచార వ్యవహారాలతో ఉత్సవాలు నిర్వహించారు. ఉదయం ఆలయంలోని అలంకార మండపంలో వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామిని చక్కగా ఆలంకరించారు. బోయిలు మోసుకుంటూ గ్రామోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్బంగా ఆలయ ప్రోటోకాల్ ఎఇఓ లు, పర్యవేక్షణలో గ్రామోత్సవం జరిగింది. అనంతరం స్వామి అమ్మవార్లను దిగువ సన్నిధివీధిలోని వసంత మండపం వద్దకు చేర్చారు. మామిడితోరణాలు, అరటి చెట్లతో ముస్తాబు చేశారు. అక్కడ ఆలయ అభిషేక గురుకుల్ డాక్టర్ స్వామినాథన్‌గురుకుల్ వేదపండితులు అర్థగిరి వేదమంత్రాల్ని పఠిస్తుండగా మేళ తాళాలు మంగళవాయిద్యాలతో గ్రామోత్సవం జరిగింది. ఉత్సవంతో పాటు ఆలయ ఇన్సె పెక్టర్ వెంకటస్వామి దఫేదార్ రాజా సియస్ఓ నాగభూషణం యాదవ్ వెంట రాగా ఉత్సవం నాలుగుమాడావీధుల్లో సాగింది.

## ధ్వజావరోహణం



ఆడికృత్తిక మహోత్సవాలు ముగింపు సందర్బంగా ఆలయంలో గురువారం రాత్రి కార్యక్రమాల్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన కలశాల్ని ఉద్వాసన గావించారు. అర్చకులు, రుత్వికులు కలశాల్ని వేద మంత్రాలను వేదపండితులు పఠిస్తుండగా మేళ తాళాలు మంగళవాయిద్యాలతో చేర్చారు. అక్కడ ధ్వజావరోహణ కార్యక్రమాల్ని శాస్త్రోక్తంగా జరిపారు.ఈ కార్యక్రమాల్లో ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి పర్యవేక్షించారు.శ్రీకాళహస్తీశ్వరాలయంలో పూజా విధానంలో భిన్న సంప్రదాయాల్ని ఆచరిస్తారు.నెల నెలా ఓ ఉత్సవం చోటు చేసుకుంది. ఈ నెల సుబ్రమణ్యం స్వామి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల నిర్వహణలో, ఉత్సవాలలో టెంపుల్‌ఇన్సె పెక్టర్లు వెంకటస్వామి, సుదర్శనం నాయుడులు చక్కగా పర్యవేక్షించారు. సమయ పాలనతో ఉత్సవాలను భక్తులకు స్వామిఅమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు.

**నేడు పల్లకి సేవ:**

ఆడికృత్తిక మహోత్సవాలు ముగింపు సందర్బంగా శుక్రవారం భారీ ఎత్తున పల్లకి సేవను నిర్వహించనున్నారు. వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామికి ఓ పల్లకిని ఏర్పాటు చేస్తున్నట్లు ఇఓ డి.బాపిరెడ్డి వివరించారు. పల్లకి సేవ రాత్రి 8గంటలకు ప్రారంభించుటకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు.ఈ ఉత్సవంతో ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు ముగిసినట్లే.

## గంజాయి విక్రయిస్తున్న భార్యాభర్తలు అరెస్ట్

### 2 కేజీల గంజాయి స్వాధీనం



పుత్తూరు (నగరి), జూలై 24 ప్రభాతవార్త : మండలంలోని ఒ.జి.కుప్పం గ్రామంలో గంజాయి విక్రయిస్తున్న భార్య,భర్తలను పోలీసులు అరెస్ట్ చేసి వారి నుంచి 2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి నగరి డిఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఒ.జి.కుప్పం గ్రామంలోని మారియమ్మ గుడి వద్ద గంజాయి అమ్ముతున్న ఒక పురుషుడు, ఒక మహిళను అదుపులోకి తీసుకుని విచారించినట్టు తెలిపారు. వారిద్దరూ గోగుల శ్యామ్‌సన్ అలియాస్ రాజు అతని భార్య ఊర్మిళగా గుర్తించామని వారి నుంచి సుమారు 30 వేల రూపాయలు విలువ చేసే రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీరిద్దరూ విశాఖపట్నం చుట్టుపక్కల ప్రదేశాల నుంచి గంజాయి తీసుకువచ్చి ఒ.జి.కుప్పం గ్రామ పొలిమేరలో వుంటూ విక్రయిస్తున్నట్టు తెలిసిందన్నారు. శ్యామ్‌సన్‌పై నగరి పోలీస్ స్టేషన్‌లో ఇది వరకే రెండు గంజాయి కేసులు వుండగా అతను ప్రస్తుతం బెయిల్‌పై వున్నాడని తెలిపారు. ప్రధాన గంజాయి సరఫరాదారుడిని పట్టుకోవడం కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. వీరిని పట్టుకోవడంలో ప్రతిభ కనపరిచిన సిఐ విక్రమ్, ఎస్ఐ విజయ నాయక్, సిబ్బంది లోకనాథం, గజేంద్ర, సత్య, అశోక్, భార్గవిలను డిఎస్పీ అభినందించారు.

### భార్యపై అనుమానం..

# ఫీల్డ్ అసిస్టెంట్‌పై హత్యాయత్నం



రేణిగుంట జూలై 24 ప్రభాతవార్త

భార్యపై అనుమానంతో ఓ వ్యక్తి తన అన్నతో కలిసి ఫీల్డ్ అసిస్టెంట్‌పై హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం ఉదయం తిరుపతి జిల్లా రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ దొడ్ల మిట్ట నందు సంచలనం రేపింది.. పోలీసుల కథనం మేరకు..దొడ్ల మిట్ట గ్రామానికి చెందిన రామాంజనేయులు అనే ఆటో డ్రైవర్ తన భార్యకు ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నవీన్ ప్రసాద్‌తో వివాహేతర సంబంధం ఉందని అనుమానపడ్డాడు. అనుమానం పెనుభూతంగా మారి నవీన్ ప్రసాద్‌ను హత్య చేయడానికి పాల్పడే వరకు దారి తీసింది. ఫీల్డ్ అసిస్టెంట్ నవీన్ ప్రసాద్ వద్ద ఉపాధి హామీ కూలిగా రామాంజనేయులు భార్య పనిచేస్తోంది. గత మూడు నెలల క్రితం భర్త తనకు ఫీల్డ్ అసిస్టెంట్ తో వివాహేతర సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్నాడని పని వెళ్లడం మానేసింది. అయినప్పటికీ రామాంజనేయులు అనుమానం తీరలేదు. భార్యను రకరకాలుగా వేధించడంతో ఆమె ఒకటిన్నర నెల క్రితం తన పుట్టింటికి వెళ్ళిపోయింది. నవీన్‌ప్రసాద్ వల్లే తన భార్య వెళ్ళిపోయిందన్న కోపంతో రామాంజనేయులు తన అన్నతో ఆదినారాయణతో కలిసి నవీన్ హత్య చేయడానికి పథకం రూపొందించారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి రెండు గంటల సమయంలో అన్నదమ్ములిద్దరూ కలిసి సీసాలో పెట్రోల్ నింపుకొని దొడ్లమిట్టలో వారు ఉంటున్న ఇళ్ళకి 50గజాల దూరంలో ఉన్న నవీన్ ప్రసాద్ ఇంటి బెడ్ రూమ్ వద్దకు వెళ్లి కిటికీ నుండి సీసాలోని పెట్రోల్ బెడ్రూంలో పోసి నిప్పంటించారు. అదృష్టవశాత్తు పెట్రోలు నవీన్‌పై పడకపోవడంతో అతనికి ఎలాంటి గాయాలు కాలేదు. ఒక్కసారి మంటలు ఉవ్వెత్తున ఎగిసి పడడంతో నవీన్ బయటకు పరుగులు తీశాడు. దాదాపు రూ.3 లక్షల విలువైన గృహోపకరణాలు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న అర్బన్ ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి, సీఐ జయచంద్ర తమ సిబ్బందితో హుటాహుటిన సంఘటన స్థలం చేరుకున్నారు. డీఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పరిస్థితులను సమీక్షించి జరిగిన సంఘటనపై ఆరా తీశారు. పోలీసులు హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను త్వరలో అరెస్ట్ చేస్తామని సీఐ జయచంద్ర తెలిపారు.

## జిల్లాలో ఉల్లాస్-అక్షర ఆంధ్ర పటిష్టంగా అమలు చేయాలి

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పిలుపు



తిరుపతి కలెక్టరేట్, జూలై 24 ప్రభాతవార్త ః

జిల్లాలో ఉల్లాస్-అక్షర ఆంధ్రను పటిష్టంగా అమలు చేస్తూ నిరక్షరాసులను అక్షరాసులుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ జిల్లా వయోజన విద్యశాఖ అధికారి మహమ్మద్ అజాద్, జిల్లా వయోజన శాఖ నోడల్ అధికారి ప్రసాద్, సిడిడిఆర్‌డిప శోభన్‌బాబు మెప్మా పీడీ రవీంద్ర, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, డీఈవో కేవీఎన్ కుమార్, ఐసిడిఎస్‌పిడి వసంతబాయిలతో ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమంపై జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి తిరుపతి జిల్లాలో 12,085 మంది వయోజన నిరక్షరాస్యులను లక్ష్యంగా పెట్టుకుని అమలైన అక్షరాస్యత కార్యక్రమం విజయవంతమైందన్నారు.2029 నాటికి వంద శాతం వయోజన ప్రాథమిక అక్షరాస్యత సాధించాలని లక్ష్యంతో దృష్టి పెట్టిందని తెలిపారు. సంబంధిత శాఖల ప్రత్యేక దృష్టి పెట్టి పటిష్టంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేసేలా చూడాలని తెలిపారు.

# రెవెన్యూ పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణ

### అవినీతి జరిగిందని తెలిస్తే చర్యలు : తహసిల్దార్లతో కలెక్టర్



చిత్తూరు, జులై 24 ప్రభాతవార్త: రెవెన్యూ శాఖ పనితీరుపై జిల్లా వ్యాప్తంగా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిసామని, ఎక్కడైనా అవినీతి జరిగినట్లు స్పష్టమైన వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తహసిల్దార్లు, రెవెన్యూ సిబ్బందిని హెచ్చరించారు. క్షేత్ర స్థాయిలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకోవాలని భావించి అత్యధికులు తహసిల్దారు కార్యాలయాలకు వస్తుంటారని, వారి సమస్యలను రెవెన్యూ అధికారులు పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్ డిఆర్ఓ మోహన్‌కుమార్‌తో కలిసి పుంగనూరు, పలమనేరు నియోజకవర్గాల పరిధిలోని తహసిల్దార్లు, మండల సర్వేయర్లు, విఆర్ఓలు, విలేజ్ సర్వేయర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ తహసిల్దారు కార్యాలయాల్లో రెవెన్యూ రికార్డుల నిర్వహణ, రక్షణ బాధ్యత అధికారులదేనన్నారు. రికార్డులను పక్కాగా నిర్వహిస్తే సమస్యలు త్వరితంగా పరిష్కారం అవుతాయన్నారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి అందిన అర్జీలను క్షేత్ర స్థాయిలో సరైన విచారణ నిర్వహించి న్యాయం చేకూర్చి, సంతృప్త స్థాయి సమస్యలను పరిష్కరించాలన్నారు. మండల స్థాయిలో ప్రజల నుండి అందిన అర్జీలను మండల స్థాయిలోనే సాధ్యమైనంత వరకు పరిష్కారం చూపాలని, ప్రజలను కార్యాలయాల చుట్టూ ప్రదిక్షిణలు చేయించుకోవద్దన్నారు. ఉద్యోగ ధర్మంను పక్కాగా నిర్వర్తించాలని తహసిల్దార్లకు సూచించారు. రెవెన్యూ సిబ్బందిపై ఎక్కడైనా దాడులు జరిగితే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. మండల స్థాయిలో సమస్యలను పరిష్కరించడానికి తహసిల్దార్లకు డిప్యూటీ తహసిల్దార్లు, విఆర్ఓలు, విలేజ్ సర్వేయర్లు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో పలమనేరు అర్డీఓ భవానీ, పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల పరిధిలోని తహసిల్దార్లు, డిప్యూటీ తహసిల్దార్లు, సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లు, విఆర్ఓలు పాల్గొన్నారు.

## చైర్మన్‌గా చెంచయ్యనాయుడు పేరు ప్రతిపాదించా: సుధీర్‌రెడ్డి



శ్రీకాళహస్తి,జూలై 24 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయం ధర్మకర్తల మండలి చైర్మెన్‌గా ఒకే ఒక పేరు ప్రతిపాదించానని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి అన్నారు.గురువారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో తెలుగుదేశం మద్దతుదారునికే అవకాశం వస్తుందని సుధీర్‌రెడ్డి వివరించారు. శ్రీకాళహస్తి రాజకీయాల్లో సుమారు 10 సంవత్సరాల నుంచి తమతో నడుస్తున్న రంగినేని చెంచయ్య నాయుడు పేరు ఒక్కటే ప్రతిపాదించినట్లు తెలిపారు. పదేళ్ళపాటు తన తో నడిచారు. పార్టీ కోసం పాటు పడిన వారికి గుర్తింపు పదవులు కల్పించాల న్నది తన నిర్ణయం అన్నారు. ఇదే తాను పార్టీకి అందించాను. పార్టీ కోసం ఎన్నో నాన్‌బెయిల్‌బుల్ కేసుల్లో ఇరుక్కున్న చెంచయ్యనాయుడుకు న్యాయం చేయాలన్నదే లక్ష్యంగా వివరించారు. తన ప్రతిపాదనను ముఖ్యమంత్రి చంద్ర బాబు ఆమోదిస్తారనే ఆశ నమ్మకం తనకు ఉందన్నారు. సభ్యులకు సంబంధించి అధిష్టానం కసరత్తు చేస్తున్నట్లు వివరించారు. కాగా శ్రీకాళహస్తి నియోజక వర్గంలోని గుడిమల్లం ఆలయానికి చైర్మెన్‌గా ఆది నుంచి ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న బత్తల గిరినాయుడు పేరును ప్రతిపాదించినట్లు ఎంఎల్ప ప్రకటించారు. చైర్మెన్ల గురించి ఎమ్ఎల్ప మొదటి సారి స్పందించారు.

# పడితే ప్రమాదమే



తిరుపతి రవాణ,జూలై 24ప్రభాతవార్త

బస్సు చక్రం ప్రగతికి చిహ్నం అనే నినాదంతో ప్రజలకు సేవలందిస్తున్న ఆర్టీసి సంస్థ తిరుపతిలోని సెంట్రల్ బస్టాండు ప్రాంగణంలో శ్రీనివాస బస్టాండులో ప్రయాణీకులు వేచివుండే ప్లాట్‌ఫామ్‌లు ప్రమాదకరంగా మారాయి. ఈ ప్లాట్‌ఫామ్‌లుపై స్లాబ్‌లు ఊడి పడిపోయేలా ఉంది. ఇప్పటికే పెచ్చులూడి పడటంతో అక్కడ వాన వస్తే ఉచితంగా నీరుకారి ప్రయాణీకులపై పడుతుంది. వారి లగేజీలు కూడా ముద్దవుతున్నాయి. ప్రధానమైన తిరుపతి ఆర్టీసి బస్టాండులో 1,2,3,4ప్లాట్‌పామ్‌లు చెన్నై,సత్యవేడు, పుత్తూరు.,శ్రీకాళహస్తి,నెల్లూరు ప్రాంతాలకు వెళ్ళే బస్టాండ్‌లో ఇదీ దుస్థితిగా మారింది. రోజూ వేలాదిమంది ప్రయాణీకులు ప్రయాణిస్తుంటారు. తిరుమలకు వచ్చే యాత్రికులేగాక పలు రకాల అవసరాలపై, పనులపై తిరుపతికి వచ్చి వెళ్ళే వారు. విద్యార్థులు కూడా ఉంటారు. ఇలా బస్సుల కోసం వేచివుండే ఈ ప్లాట్‌ఫామ్‌లు శిథిలావస్థకు చేరాయి. ఉన్నవరకు దీన్ని భద్రంగా చూడాలని ప్రయాణీకులు కోరుతున్నారు. ఇక తిరుపతి -శ్రీకాళహస్తి మధ్య తిరిగే ఆర్టీసి ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో,నాన్‌స్టాప్‌బస్సుల్లో ముందుగానే గమ్యస్థానం బయలుదేరేచోట ఆర్టీసి కండక్టర్‌లు టిక్కెట్ కొట్టి ఆ తరువాత దిగేస్తారు. మధ్యలో ఎక్కడా బస్సులు ఆపరు. ఇది కొంతవరకు బాగానే ఉన్నా ఈ బస్సుల్లో టిక్కెట్ జారీచేసే పిఓఎస్ యంత్రాల్లో డిజిటల్ స్కానర్లు పనిచేయడం లేదని కండక్టర్లు ప్రయాణీకులపై విరుచుకు పడుతున్నారు. మరీ శ్రీకాళహస్తి శివారుకు చేరేవరకు బస్సుల్లో టిక్కెట్ ఇవ్వడంలేదు. తిరుపతిలో కూడా రామానుజసర్కిల్ వరకు చేరేవరకు బస్సుల్లో ఈ నాన్‌స్టాప్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో టిక్కెట్లు ఇవ్వరు. అంత దూరం వెళ్ళిన తరువాత ప్రయాణీకులు డిజిటల్ పేమెంట్ చేసి టిక్కెట్ తీసుకుంటామంటే స్కానర్లు పనిచేయడంలేదని కండక్లర్లు అర్థాంతరంగా దిగేయమనడం లేక దుర్భాషలాడుతున్నారు. ప్రయాణీకుల సేవే పరమావధిగా ఉన్న ఆర్టీసి అధికారులు ఇలాంటి కొందరు కండక్టర్లవల్ల సంస్థకు చెడ్డపేరు వచ్చే అవకాశముంది. అధికారులు స్పందించాల్సి ఉంది.

## తిరుపతి ఆర్టీసిబస్టాండ్‌లో ప్లాట్‌పామ్‌లపై ఊడుతున్న స్లాబ్ ప్రయాణీకుల ఆందోళన



## ప్రభుత్వ పాఠశాలకు క్రీడాసామగ్రి వితరణ



**కుప్పం,జూలై 24 ప్రభాతవార్త** స్థానిక షికారీ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలకు మాజీ ఎంపిటిసి కృష్ణన్, 11వ క్లస్టర్ ఇన్‌చార్జ్ కె.కన్నన్‌లు గురువారం క్రీడాసామగ్రిని తమవంతు వితరణగా అందించారు. ఈసందర్భంగా దాతలు మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ఇటీవలే పాఠశాలలో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించామన్నారు. ఈసందర్భంగా పాఠశాల అవసరాలు, సమస్యలు అడిగి తెలుసుకుని తమవంతు సహకారం అందిస్తున్నామన్నారు. విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు గాను పదివేల రూపాయల విలువ చేసే క్రీడా సామగ్రిఅందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వేలు, కో క్లస్టర్ ఇన్‌చార్జ్ తిరుమగళ్, నేతలు ఆర్ముగం, ఇమ్రాన్, ఇర్ఫాన్, లోకేష్, మోహన్ పాల్గొన్నారు.

## కుప్పంలో రేపు ద్రావిడ స్నేహ దినోత్సవం

**కుప్పం, జూలై 24 ప్రభాతవార్త** ద్రావిడ సిటీ మూమెంట్స్ స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో ఈనెల 26వతేది కుప్పంలో ద్రావిడ స్నేహ దినోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు అభి గౌడ తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12గంటలకు ఈకార్యక్రమం కుప్పం రైల్వే స్టేషన్ నుంచి మొదలై ద్రవిడ వర్సిటీ వరకు చేరుతుందన్నారు. ఈకార్యక్రమంలో పాల్గొనదలచిన వారు 9492133984, 9686177118నెంబర్లను సంప్రదించాలని కోరారు. తెలుగు,తమిళం, కన్నడ, మళయాళ భాషలు మాట్లాడుకునే ప్రజలందరూ కలుసుకునేందుకు సరైన చోటు ద్రవిడ వర్సిటీ అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు, విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## చెక్కునత్తంలో సుపరిపాలనలో తొలిఅడుగు

**కుప్పంరూరల్, జూలై 24 ప్రభాతవార్త** మండలంలోని చెక్కునత్తం పంచాయతీలోని ఎస్సీ కాలనీలో గురువారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంను రాష్ట్ర తెలుగుయువత ఆర్గనైజింగ్ కార్యదర్శి చెక్కునత్తం మణి అధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో నేతలు బాలు, వినోద్, బీరప్ప, వెంకటాచల ం తదితరులు పాల్గొన్నారు.





## లబ్దిదారులకు దీపం కనెక్షన్లు పంపిణీ

**శాంతిపురం, జూలై 24 ప్రభాతవార్త** మండలంలోని రాళ్లబూదుగూరు గ్రామంలో అర్హులైన లబ్దిదారులకు దీపం 2.0పథకంలో భాగంగా గ్యాస్ కనెక్షన్లను ఎంపిడిఒ పిఆర్ కుమార్ అధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు, ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ ఆదేశాలతో మండలంలో అర్హులకు తప్పక గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేస్తామన్నారు. అర్హులు ఇంకా ఉంటే తమ దరఖాస్తులను పంచాయతీ కార్యదర్శికి అందించాలన్నారు. ఎస్సీ,ఎస్టీ కుటుంబాలకు సంబంధించి 162మంది వివరాలు మంజూరుకోసం ప్రతిపాదించామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శివశంకరయ్య, నేతలు మణి, బసవరాజు, కుమార్, నారాయణ, రామకృష్ణారెడ్డి, కుమార్, మనోహర్, గ్యాస్ కంపెనీ డీలర్లు మంజునాథ్, చౌడప్ప పాల్గొన్నారు.

## పాఠశాల భవన నిర్మాణాల పూర్తికి చర్యలు

**రామకుప్పం, జూలై 24 ప్రభాతవార్త** మండలంలోని చిన్నబల్దారు గ్రామంలో అర్థాంతరంగా ఆగిన ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని టిడిపి మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి తెలిపారు. గురువారం ఆయన పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా భవన నిర్మాణ సమస్య ను ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు భూపతిరెడ్డి, నేతలు నందారెడ్డి, వెంకటరెడ్డి, మురళీమోహన్, లక్ష్మీపతి పాల్గొన్నారు.



## నియోజకవర్గంలో 21 నూతన పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు



**పలమనేరు,జూలై 24,ప్రభాతవార్త:** పలమనేరు నియోజకవర్గం రాజకీయ పార్టీ ప్రతినిధులతో గురువారం ఆర్డీఓ భవాని సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ పలమనేరు నియోజవర్గంలో 288 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని అందులో 1200పై ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఆ ప్రాంతంలో అదనంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేపట్టవలసి ఉందని తెలిపారు. ఈ క్రమంలో పొలిటికల్ సభ్యుల సూచనల మేరకు నియోజకవర్గంలో అదనంగా 21 పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు పంపనున్నామని తెలిపారు. పలమనేరు పట్టణంలో 2,పెద్దపంజాణిలో 1,గంగవరంలో 4,బైరెడ్డిపల్లెలో 6,వి.కోటలో 8 పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు జిల్లా ఎన్నికల అధికారులకు పంపనున్నామని తెలిపారు. పలమనేరు నియోజవర్గంలో అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు

## వేతనాల పెంపు పట్ల మున్సిపల్ కార్మికుల హర్షం

**పలమనేరు,జూలై 24,ప్రభాతవార్త:** ప్రభుత్వం ఓట్ సోర్సింగ్ కార్మికుల వేతనాల పెంచ డంతో పలమనేరు మున్సిపల్ ఓట్ సోర్సింగ్ కార్మికు లు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మున్సి పల్ కార్యాలయం ఆవరణలో గురువారం ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్య మంత్రి పవ న్‌కళ్యాణ్,పలమనేరు ఎమ్మెల్యే అమరనా థరెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఒకటవ కేటగిరి వర్కర్లకు రూ.21,500 నుండి 24,500,రెండవ కేటగిరి వర్కర్లకు రూ.18,500 నుండి రూ.21,500,మూడవ కేటగిరి వర్కర్లకు రూ.15,000 నుండి రూ.18,500లకు వేతనాలు పెంచడంతో హర్షం వ్యక్తం చేశారు. కౌన్సిలర్లు కిరణ్,కుమార్,టిడిపి నాయకులు గిరి,గ్యాస్ నాగరాజు,కుట్టి, కార్మికులు పాల్గొన్నారు.



## నేసనూరు ఆదర్శ పారిశ్రామిక పాఠశాలలో విద్యా సామగ్రి పంపిణీ



**పుత్తూరు రూరల్, జూలై 24 ప్రభాతవార్త:** పుత్తూరు మండలం మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాల నేసనూరు(ప్రధాన) పాఠశాలలో పుత్తూరు సూర్య ఎలక్ట్రికల్స్ అధినేత సూర్య 60 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు ఉచితంగా పంపిణీ చేశారు. పాఠశాల చైర్‌పర్సన్ సుగుణ విద్యార్థులకు పెన్సిల్, రబ్బర్లు, పలకలు ఉచితంగా పంచారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరి వద్ద డబ్బులు ఉంటాయని, సహాయం చేసే గుణం కొంత మందికే ఉంటుందని తెలియజేశారు. మనకు తోచిన సహాయం ఇతరులకు చేయడం గొప్ప విషయమని కొనియాడారు. దాతలను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నరేష్‌కుమార్, చెంచుకృష్ణ, అంగన్‌వాడీ టీచరు ధనమ్మ పాల్గొన్నారు.

## ఘనంగా చౌడేశ్వరి అమ్మవారి జన్మదినోత్సవం

**సదుం, జూలై 24, ప్రభాతవార్త** అమావాస్య సందర్భంగా సదుం పంచాయతీ జాండపేటలోని శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి ఆలయంలో మహామాత జన్మ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం మంగళ వాయిద్యాలతో 108 పాల కలశాలతో మహిళలు వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మ వారికి పాలాభిషేకం నిర్వహించారు. భక్తుల చేత ప్రసన్నార్చన జరిపించారు. అన్న ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాదం స్వీకరించారు.దిగువ జాండ్రపేట తదితర గ్రామ మహిళా భక్తులు పాల్గొన్నారు.

## పక్కాగా నీటి సరఫరా, పారిశుధ్యం

**– మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్**



**చిత్తూరు, జులై 24 ప్రభాతవార్త:** చిత్తూరు నగర పరిధిలోని ప్రతి డివిజన్‌లో మంచినీటి సరఫరా, పారిశుధ్యం నిర్వహణ పక్కాగా చేపట్టాలని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ గురువారం వరిగిపల్లి, సంజయ్‌గాంధీ కాలనీల్లో మంచినీటి సరఫరా, పారిశుధ్యం పనులను పరిశీలించారు. వరిగిపల్లి హరిజనవాడలో మంచినీటి ట్యాంకు, నీటి సరఫరా పైపులైనును కమీషనర్ పరిశీలించి వర్కర్లకు సూచనలు చేశారు. పైపు లైను లీకేజీ లేకుండా ఎప్పటికప్పుడు మరమ్మత్తులు చేపట్టాలని, ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని ఇంజనీరింగ్ అధికారులను కమీషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్, ఎఇ లోకేష్, వార్డు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలలు మూసివేసే ప్రయత్నం మానుకోవాలి

**చిత్తూరు, జులై 24 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను మూసివేసే ప్రయత్నంను విరమించుకోవాలని కాంగ్రెస్ మాజీ ఎంపీ చింతామోహన్ డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలలను మూసివేసే ప్రయత్నాలను ఖండిస్తూ గురువారం చిత్తూరు గాంధీ విగ్రహం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎంపి చింతామోమన్ నేతృత్వంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంను ఉద్దేశించి మాజీ ఎంపీ చింతామోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ పిల్లలు అత్యధిక మంది విద్యనభ్యసిస్తున్నారని, కూటమి ప్రభుత్వం అనాలోచిత నిర్ణయం తీసుకుని ప్రాథమిక పాఠశాలలను మూసి వేయడం ద్వారా ఎక్కువ మంది ఎస్సీ ఎస్టీ విద్యార్థులు ప్రాథమిక విద్యకు దూరం చేయడానికి ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. టిటిడిలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు ప్రాధాన్యత ఇస్తూ పరిపాలన సాగించాలని సూచించారు. ఈ పరిస్థితికి విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుంటే రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళనలు, ఉద్యమాలు జరుగుతాయని ఆయన హెచ్చరించారు.




## సాంప్రదాయ బద్ధంగా భీమనమావాస్య పూజలు



**బోయకొండ(చౌడేపల్లి), జూలై 24 ప్రభాతవార్త** శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మ ఆలయంలో గురువారం భీమనమావాస్య పూజలను సాంప్రదా యబద్ధంగా నిర్వహించారు. ఈ అమావాస్య రోజున భీముడులాంటి భర్తను పొందాలన్న ఉద్దేశ్యంతో పలువురు కన్యలు అమ్మవారికి ప్రత్యేక ముడుపులు చెల్లించారు. ఉదయాన్నే వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో గంగమ్మకు విశేషాభిషేకం, అలంకరణగావించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో యాత్రీకులు తరలివచ్చారు. ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం, అధికార, సిబ్బంది సేవలందించారు.

## టిక్కెట్ల గోల్‌మాల్‌లో ఆరుగురిపై కేసు నమోదు

**చౌడేపల్లి, జూలై 24 ప్రభాతవార్త**

శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో జరిగిన పెద్దభోగం టిక్కెట్ల గోల్‌మాల్‌లో 6గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. ఆయన కథనం మేరకు...గంగమ్మ ఆలయంలో పెద్దభోగం టిక్కెట్ల విషయంలో అవినీతికి పాల్పడ్డారనే అనుమానంతో ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాగముని, గంగరాజు, విజయ్‌కుమార్‌రెడ్డి, మునిశేఖర్, హరిప్రసాద్, సోమశేఖర్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## కుప్పంలో 3.55కోట్లతో నూతన షాదీమహల్



**కుప్పం, జూలై 24 ప్రభాతవార్త** సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నంల సూచనలతో కుప్పంలో ముస్లిం మైనార్టీల కోసం 3.55కోట్లతో నూతన షాదీమహల్ నిర్మించనున్నట్లు టిడిపి కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు, కడ పిఎసి సభ్యుడు రాజ్‌కుమార్ తెలిపారు. గురువారం గుడుపల్లె రోడ్డు వద్ద రత్న మినరల్ ఫ్యాక్టరీ వద్ద లక్ష్మీపురం చెరువు పక్కన ఎనభై సెంట్ల స్థలాన్ని అధికారులు, మైనార్టీ నేతలతో కలసి ఆయన పరిశీలించారు. త్వరలోనే ప్రభుత్వం టెండర్లు పిలిచి నిర్మాణాలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎఇ ఆంజనేయులు, సర్వేయర్ సాయి, మైనార్టీ నేతలు జాకీర్, సర్దార్, అన్సర్, ముజీబ్, చాంద్, ఉమ్మేర్ ఖాన్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబుతోనే కుప్పం అభివృద్ధి

**– టిడిపి మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్**



**కుప్పం, జూలై 24 ప్రభాతవార్త** సిఎం చంద్రబాబు నాయుడుతోనే కుప్పం అభివృద్ధి సాధ్యమవుతుందని మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం పాతపేట 23,24 వార్డుల్లో ఆయన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏడాది పాలనలో కుప్పంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఆయన ప్రజలకు వివరించారు. త్వరలోనే మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు ప్రారంభం అవుతాయన్నారు. ఈసందర్భంగా ప్రజలసమస్యలు అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నేతలు భరత్,వినయ్, డికె కృష్ణ, గోవిందరాజులు, చరణ్, సెంధిల్ పాల్గొన్నారు

## సుపరిపాలనలో తొలిఅడుగుపై ఐవిఆర్ఎస్ సర్వే

**కుప్పం, జూలై 24 ప్రభాతవార్త** సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా జూలై 2వతేది నుంచి చేపడుతున్న సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంపై తెదేపా అధినాయకత ్వం ఐవిఆర్ఎస్ సర్వే చేపడుతోంది. కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం మండలం తిమ్మరాజుపల్లి గ్రామంలో సిఎం చంద్రబాబునాయుడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయం విదితమే. రాష్ట్ర వ్యాప్తంగా నెలరోజుల పాటు ఈ కార్యక్రమంను నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎమ్మెల్సీలు, పార్టీ ఇన్‌చార్జ్‌లతో పాటు పార్టీ కేడర్ ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి ఏడాది పాలనలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంను పార్టీ కేడర్ సక్రమంగా నిర్వహిస్తోందా లేదా అనే అంశంగా ఐవిఆర్ఎస్ సర్వే చేపడుతున్నారు. నాయకులు ఇళ్ల వద్దకు వచ్చి అభివృద్ధి, సంక్షేమ కరపత్రాలు అందిస్తున్నారా లేక అలాగే వచ్చి వెళుతున్నారా అనే విషయంగా ప్రజలనుంచి అభిప్రాయ సేకరణ చేపడుతున్నారు.

## ఘనంగా దుర్యోధన వధ కార్యక్రమం

**సదుం, జూలై 24, ప్రభాతవార్త** సదుంలోని బట్టు వారి పల్లె వద్ద పెద్దిరెడ్డి భాస్కర్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా గురువారం సాయంత్రం దుర్యోధన ఘట్టాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాత్రధారులు నాటకాన్ని విశేషంగా ప్రదర్శించారు. అంతకుముందు మధ్యాహ్నం హరికథ కళాకారుని జోత్స్నచే హరికథా కాలక్షేపం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కనికాపురం ప్రభుత్వ పాఠశాలకు వంట పాత్రలు వితరణ



**గంగాధర నెల్లూరు, జూలై 24 ప్రభాతవార్త :** మండల పరిధిలోని వరత్తూరు పంచాయతీ కనికాపురం ప్రభుత్వ పాఠశాలకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వినోద్ నాయుడు వంట పాత్రలను గురువారం ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర నాయుడుకి అందజేశారు. ఈ సందర్భంగా వినోద్ నాయుడు మాట్లాడుతూ తన సంపాదనలో కొంతశాతం సామాజిక సేవకు వినియోగించాలన్నది తన అభిప్రాయమని, దీనిలో భాగమే ఈ వంట పాత్రల వితరణ అని అన్నాడు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ ఛైర్మెన్ సుధాకర్, మాజీ సర్పంచ్ రియాజ్ అలీ నరసింహ నాయుడు, చంద్రమ నాయుడు, దేవరాజులు తదితరులు పాల్గొన్నారు.

## పాలేటమ్మ జాతర పకడ్బందీగా నిర్వహిస్తాం

**సోమల, జూలై 24, ప్రభాతవార్త** నెల్లిమంద సమీపంలో వెలసిన పాలేటి గంగమ్మ జాతరను పకడ్బందీగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు కార్యవర్గ సభ్యులు తెలిపారు. గురువారం ఆలయ ప్రాంగణంలో సమావేశమైన వీరు జూలై 27వ తేదీ అమ్మవారి జాతరకు శ్రీకారం చుట్టా ఉన్నట్టు తెలిపారు. అలాగే ఆగస్టు మూడు నాలుగో తేదీల్లో జాతరను నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్య నిర్వాహకులు తెలిపారు. ఆలయ ధర్మకర్త సాకి బండ నరసింహులు ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. పాయల రమేష్ బాబు, జగన్మోహన్, వరద రమణ, సాంబశివయ్య తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల కష్టసుఖాల కోసమే టిడిపి అంకితం



**పుంగనూరు, జూలై 24, ప్రభాతవార్త** ప్రజల కష్టసుఖాలను తెలుసుకొని పరిపాలన చేసేది ఒక్క తెలుగుదేశం పార్టీ మాత్రమేనని పార్టీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. సింగరిగుంట గ్రామంలో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించిన టీడీపీ మండల అధ్యక్షుడు మాధవ్ రెడ్డి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పంచాయితీ అధ్యక్షుడు మంజు జనసేన రూరల్ వైస్ ప్రెసిడెంట్ సుబ్బు మణి, హరి, అంబరీష్, దాము, కూటమి నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ చౌడేశ్వరి జయంతి

**పుంగనూరు రూరల్, జూలై 24, ప్రభాతవార్త** చదళ్ల గ్రామంలో గురువారం శ్రీ సప్తమాతృక సమేత శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎన్. వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం గణపతి ప్రార్థన, వేదపారాయణంతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం కలశస్థాపన, పంచామృతాభిషేకం,సుగంధద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. గణపతి, నవగ్రహ, త్రిమూర్తుల హోమాలు, సప్తమాతృకలహోమం, చౌడేశ్వరి మూలమంత్ర హోమం, పంచదుర్గ, జయాది హోమాలు ఘనంగా సాగాయి.



## పి కొత్తకోట బాలుర వసతి గృహంలో మెరుగైన సౌకర్యాలు



**పూతలపట్టు, జూలై 24, ప్రభాతవార్త** పూతలపట్టు మండలంలో పి కొత్తకోట బాలుర వసతి గృహానికి మహర్దశ చోటు చేసుకుంది. ఎంపీ నిధులు కింద సాంఘిక సంక్షేమ శాఖ నిధుల కింద సుమారు 21 లక్షల రూపాయలతో అధునాతనంగా మరమ్మతులు చేయబడిన ఈ వసతి గృహము పేద విద్యార్థులకు ప్రభుత్వం కల్పించే నాణ్యమైన భోజనముతో పాటు మెరుగైన విద్య అందిస్తున్నది. గతంలో 17 మంది ఉన్న ఈ హాస్టల్ 36 సంవత్సరాల అనుభవం కలిగిన జయచంద్ర రెడ్డి వార్డెన్ రావడంతో ఇప్పుడు 70 మంది విద్యార్థులతో కొత్త కళ సంతరించుకుంది. నిత్యం పిల్లలకు అందుబాటులో ఉంటూ వారికి చదువుతో పాటు కంటికి రెప్పలా కాచుకుంటున్న సిబ్బంది జ్ఞాన శేఖర్ పిల్లల పట్ల చూపిస్తున్న సేవకు మమకారంనకు తల్లిదండ్రులు మంత్రముగ్ధులయ్యారు. ప్రభుత్వ సౌకర్యాలు అందించడమే కాకుండా ఇలాంటి వార్డను, ఇలాంటి సిబ్బంది సాంఘిక సంక్షేమ శాఖలో ఉండడం గర్వించదగిన విషయం.

## కూటమి ఏడాది పాలనలో రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు



**ఐరాల, జూలై 24 ప్రభాతవార్త:** కూటమి ఏడాది పాలనలో రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు తీస్తోందని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం సుపరిపాలనతో తొలి అడుగు కార్యక్రమాన్ని మండలంలోని కలికిరిపల్లె, ఇరువారంపల్లె తెల్లగుండ్లపల్లె, పొలకల, నెల్లిమందపల్లె గ్రామాల్లో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో మండల టీడీపీ నాయకులతో కలసి ఇంటింటికి వెళ్ళి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వ సాధించిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు గురించి వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. కూటమి ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో భాగంగా ఆయన పలు గ్రామాల్లో సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఐరాల మండల టీడీపీ అధ్యక్షుడు గంగారపు హరిబాబునాయుడు, మాజీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, ఐరాల జడ్పీటీసీ సుచిత్ర, మాజీ జడ్పీటీసీ ఎం.లత, ఐరాల సింగిల్ విండో ఛైర్మన్ శేషాద్రినాయుడు, మండల నాయకులు మోహన్‌నాయుడు, దేవాజీ, పూర్ణచంద్రరావులతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## డిప్యూటీ తహశీల్దార్‌గా శ్రావణ్ కుమార్

**కల్లూరు, జూలై 24, ప్రభాతవార్త** పులిచెర్ల తాసిల్దార్ కార్యాలయ డిప్యూటీ తాసిల్దార్ గా శ్రావణ్ కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డి టీ. శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ తాసిల్దార్ జయసింహ, అందరి సహకారంతో మండలంలో భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.

## ఎఐఎంఎస్ఆర్‌లో సిమ్యులేషన్ టెక్నాలజీపై వర్క్‌షాప్

**చిత్తూరు, జులై 24 ప్రభాతవార్త:** చిత్తూరు అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్‌లోని డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి నాలెడ్జ్ సెంటర్ సెమినార్ హాలులో గురువారం సిమ్యులేషన్ టెక్నాలజీపై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌ను అడడెమిక్స్ అసోసియేట్ డీన్, మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ రమ్యా రామకృష్ణన్ ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెడికల్ విద్యార్థుల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో సిమ్యులేషన్ ఒక కీలక సాధనంగా వుంటుందని స్పష్టం చేశారు. ఎఐఎంఎస్ఆర్ కరికులం సభ్యులు డాక్టర్ ఓ.సిద్దార్థ్, డాక్టర్ లోకేష్‌లు రీసోర్స్ ఫ్యాకల్టీ వర్క్‌షాప్ నిర్వహించారు. ఆపై అధ్యాపకులు మూడు బృందాలుగా ఏర్పడి క్రియాశీలక కార్యక్రమాలు నిర్వహిం చారు. ఈ వర్క్‌షాప్ ద్వారా సిమ్యులేషన్ పద్ధతుల గురించి అవగాహన మరింత బలపడిందని అధ్యాపకులు అభిప్రాయపడ్డారు.



## ఆసుపత్రికి రూ.5లక్షల పరికరాలు విరాళం

**శ్రీకాళహస్తి,జూలై 24 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి చొరవతో ఆసుపత్రికి రూ.5లక్షల విలువ కల్గిన సామగ్రిని గురువారం అందించారు. శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి ఎంఎల్ఏ అభివృద్ధి కమిటిని నియమించారు. ఈ కమిటి సమావేశంలో అశ్రత ఇన్‌ఫ్రాక్చర్ అధినేత డివియస్ శ్రీధర్ వర్మ ఆక్సిజన్ ప్లాంట్, స్టాండులు ఆసుపత్రికి అవసరమైన పరికరాలు అందించారు. రాబోవు రోజుల్లో మరి కొందరు రూ.పది లక్షల విలువ కల్గిన వెసులుబాట్లు అందించటానికి భరోసా ఇచ్చారని తెలిపారు.

***ఆసుపత్రి నూతన కమిటీ:*** శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో రాబోవు రోజుల్లో అభివృద్ధికి సంబంధించి అభివృద్ధి కమిటిని నియమించారు. చైర్మెన్‌గా బొజ్జల సుధీర్‌రెడ్డి, సభ్యులుగా పార్లమెంటు సభ్యుడు మద్దెల గురుమూర్తి, సభ్యు లుగా జిల్లా వైద్యాధికారి ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సంజీవ్‌కుమార్, ఎపి మెడికల్ అధికారి శివరామిరెడ్డి, శ్రీకాళహస్తికి చెందిన డాక్టర్ శంకర్‌ప్రసాద్‌రెడ్డి,డాక్టర్ ఓ శ్రీనివాసులురెడ్డి,(జిల్లా ఉప ఆరోగ్యాధికారి) ఎన్ మునికుమార్, సూపరింటెంట్ మణి, డాక్టర్ గెరటారెడ్డి,వినయక్‌కుమార్, సుమతి,కుమార్,గరికపాటి రమేష్‌లను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

## ప్రైవేటు పాఠశాలల సమస్యలను పరిష్కరించండి

**శ్రీకాళహస్తి,జూలై 24 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తిలోని ప్రైవేటు పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని గురువారం పాంశాల కమిటి నిర్వాహకులు ఎంఇఓ బాలయ్యకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రైవేటు పాఠశాలల కమిటి చైర్మెన్ చెవిరెడ్డి మధుసూధనరెడ్డి సారధ్యంలో విద్యాశాఖ అధికారిని కలసి విన్నవించారు. ఈసందర్భంగా మధుసూధనరెడ్డి మీడియాతో మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలో బకాయి ఉన్న విద్యార్థులు చెల్లించక ప్రభుత్వ పాఠశాలలో చేరటానికి వెళుతున్నారని అయితే ప్రభుత్వ పాఠశాలలు ఎలాంటి సర్టిఫికేట్లు లేకుండా చేర్చుకుంటూ ప్రైవేటు పాఠశాలల మనుగడకు ముప్పుతెస్తున్నారని వాపోయారు. ఇలాంటి విద్యార్థులను చేర్చుకునే ముందు పరిశీలనలు జరపాలని సంబంధిత పాఠశాలల నుంచి పీజు క్లియరెన్స్‌తో పాటు టిసిలు ఇవ్వాలని ప్రభుత్వ పాఠశాలలు ఆదేశించాలన్నారు. ఈ సమస్యలపై ఎంఇఓ బాలయ్య మాట్లాడుతూ ఈ సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తామన్నారు.

## ప్రతి ఒక్కరు స్వచ్ఛమైన నీటిని తాగాలి: ఎంఎల్ఏ

**శ్రీకాళహస్తిరూరల్, జూలై 24 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తి మండలంలోని ప్రతి గ్రామంలో ప్రజలు స్వచ్ఛమైన నీటిని తాగాలని శాసన సభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. మండ లంలోని యార్లపూడి,మేలచ్చూరు గ్రామాల్లో ఆర్‌ఓ ప్లాంట్లను ఆయన ప్రారంభించారు. గ్రీన్ ప్యానల్ కంపెనీ తరఫున యార్లపూడిలో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసారు. ఒక్కగ్రీన్ ప్యానల్‌యే కాకుండా ఇతర భారీ పరిశ్రమలను కూడా భాగస్వాముల్ని చేస్తు న్నామని వివరించారు. ప్రతి గ్రామంలోనూ ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నా మన్నారు. తాము ప్లాంట్లను ఏర్పాటు చేస్తాము కానీ దానిని గ్రామ సర్పంచ్‌లే పర్యవేక్షించాలన్నారు. మేలచ్చూరు గిరిజన కాలనీలో తొలిఅడుగు కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామంలో ప్రజలు తామంతా గిరిజనులు కాబట్టి అటవీ ఫల సాయాన్ని విక్రయించుకొనుటకు అనుమతి సాధించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో రంగినేని చెంచయ్యనాయుడు,తాటిపర్తి ఈశ్వర్‌రెడ్డి, కృష్ణయాదవ్, చెలికం పాపిరెడ్డి, ఎంపిడిఓ పద్మజ,గ్రామస్తులు మాజీ జడ్‌పిటిసి సుబ్బరాయులుపాల్గొన్నారు.

## ఏర్పేడు రూపురేఖలు మార్చేస్తున్న కూటమి

**శ్రీకాళహస్తి రూరల్, జూలై 24 ప్రభాతవార్త**



కూటమిప్రభుత్వంలో ఏర్పేడుమండలం రూపు రేఖలను మార్చటానికి శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి కృషి చేస్తున్నారని మండల పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజనాయుడు అన్నారు. గురువారం మండలంలోని పాపానాయుడు పేటలో తొలిఅడుగు కార్యక్రమాలను నిర్వహించారు. బొజ్జల కుటుంబం హయాంలో పేట రూపురేఖలు మార్చారన్నారు. మైనారిటి ముస్లింలకు షాదిమహల్, ఈద్‌గాహ, జూనియర్ కళాశాల అలాగే ధర్మరాజుల స్వామి ఆలయ అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. కార్యక్రమాల్లో పేరం ధనంజయులు నాయుడు,పొన్నారావు,బత్తల గిరిబాబునాయుడు,బాబు నాయుడు,సూరినాయుడు,సుధాకర్‌రెడ్డి కృష్ణప్ప మొదలి, చిరంజీవులు నాయుడు అర్జున్‌బాబు,తంబా శ్రీనివాసులులోకేష్, రాజగోపాల్, మనోహర్ నాయుడు, రవికుమార్,విజయ్,కృష్ణయ్యతదితరులు దేశం నాయకులు పాల్గొన్నారు.

## అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలో ఆర్.ఐ పోస్టు ఖాళీ

**తిరుపతిరూరల్, జూలై 24 ప్రభాతవార్త:**

తిరుపతి అర్బన్ తహశీల్థార్ కార్యాలయంలో మూడు నెలలుగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీగా ఉండటంతో శాఖపరమైన రెవెన్యూ సమస్యలు పేరుకుపోతున్నాయి. తిరుపతిఅర్బన్ తహశీల్థార్ కార్యాలయంలో ఆర్.ఐ.గా విధులు నిర్వహించే కృష్ణమ్మ పదోన్నతిపై వడమాలపేట డిప్యూటీ తహశీల్థార్‌గా బదిలీపై వెళ్ళగా, పాకాల తహశీల్థార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పవన్ పదోన్నతిపై తిరుపతి అర్బన్ ఆర్.ఐగా వచ్చారు. కానీ పవన్ చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానికి పి.ఏ.గా విధులుగా నిర్వర్తించడంతో తిరుపతిఅర్బన్ తహశీల్థార్ కార్యాలయంలో గత మూడు నెలలుగా ఆర్.ఐ పోస్టు ఖాళీగా ఉంది. అర్బన్ తహశీల్థార్ కార్యాలయానికి ప్రతిరోజు 100నుండి 150వరకు వివిధ రకాల సర్టిఫికేట్స్ కోసం ధరఖాస్తులు వస్తుంటాయని, ప్రతి సర్టిఫికేట్‌లోను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంతకం ఉండాల్సి ఉంటుంది. అలాగే రెవెన్యూ పరమైన సమస్యలు, కోర్టు, పోలీసు, బ్యాంకు, యాక్సిడెంట్స్, భూ సమస్యలు తదితర సమస్యలు ఎన్నో ప్రతి రోజు వస్తూనే ఉంటాయి. వీటి పరిష్కారంలోను ఆర్.ఐ భాగస్వామ్యమై ఉంటారు. రెవెన్యూ కార్యాలయంలో ఆర్.ఐ. పోస్టు తలలో నాలుక లాగా కీలకంగా ఉంటుంది. గత 3నెలలుగా ఖాళీగా ఉండటంతో సర్టిఫికేట్స్ జారీలో జాప్యం నెలకొంటుంది. జిల్లా అధికారి స్పందించి తిరుపతి అర్బన్ తహశీల్థార్ కార్యాలయంలో ఆర్.ఐ. పోస్టును భర్తీ చేయాల్సి ఉంది.

